విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి-అనంతగిరి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆశ్రమ గురుకుల పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వంతో పాటు యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు సమంజసమని ఎస్ఎఫ్ఐ నేత ఆనంద్, గిరిజన ప్రజాసంఘాల నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు రాంబాబులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గుమ్మకోట ఏపిఆర్ గురుకుల పాఠశాల లో అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థి పాంగి. గౌతమ్ పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ ఎందుకు యాజమాన్యం పటించుకోలేదని మండిపడారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్య కారణంగానే ఈ పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. మన్యంలోని పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుదని, సంబంధిత అధికారులు పర్యవేక్షణ లోపంతోనే సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రతి ఆశ్రమ, గురుకుల కళాశాలలో హెల్త్ అసిస్టెంట్లను రెగ్యులర్ చేసి వైద్య సేవలు అందించి విద్యార్థుల ఆరోగ్యం కాపాడాలని గిరిజన సంఘం అరకు నియోజకవర్గ కార్యదర్శి పాంగి రామన్న డిమాండ్ చేశారు.

గిరి రైతుల్లో తుపాను గుబులు

▸స్తంభించిన వరి కోతలు, నూర్పులు ▸వరి పంటల సంరక్షణకు పరుగులు

ప్రజాశక్తి-పాడేరు: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో మన్యంలో గత రెండు రోజులుగా చినుకులు, ఈదురు గాలులతో వాతావరణం భిన్నంగా మారిపోయింది. తుఫాన్ ప్రభావం నెలకొనడంతో వరి పంట సంరక్షణ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఏజెన్సీ అంతటా గత వారం నుంచి ముమ్మరంగా మొదలైన వరి కోతలు, నూర్పులు తదితర పనులు ఒక్కసారిగా స్తంభించాయి. ఇప్పటికే ఏజెన్సీలో 40 శాతం వరకు వరి కోతలు పూర్తయ్యాయి. కొందరు రైతులు ధాన్యం నూర్పులు కూడా చేపట్టారు. వర్ష ప్రభావం మన్యమంతట నెల కొనడంతో రైతులు ఇప్పటికే సిద్ధమైన తమ వరి పంటను తుఫాన్ ముప్పు నుండి సంరక్షించుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. వరి కోతలు పూర్తి చేసిన రైతులు తమ కళ్ళాల్లోకి వరి కుప్పలు వేసి వర్షం బారిన పడి పాడవకుండా పాలిథిన్ కవర్లతో కప్పి భద్రపరిచే పనిలో నిమగ్నమయ్యారు. తుఫాన్ రాకడ గిరి రైతులకు వ్యయ ప్రయాసలు కలిగించింది. గ్రామాలకు దూరంగా ఉండే కల్లాలలో వరి కుప్పలను సంరక్షించుకోవడానికి రైతులకు ప్రయాసగా మారింది. సిద్ధమైన పంట కూడా వర్షాలు, ముంపుకు గురికాకుండా రైతులు తమ పొలాల్లో వర్షపు నీరు చేరి పంట పాడవకుండా తగు జాగ్రత్తలు చేపట్టి అప్రమత్తమయ్యారు. సరిగ్గా పంట చేతికి వచ్చే సమయానికి ఈ తుఫాన్ ప్రభావం రైతుల్లో కొంత గుబులు రేపుతోంది.

కోసిన వరి పంట

రైతులు అప్రమత్తంగా ఉండండి

జిల్లా జాయింట్ కలెక్టర్ సూచన

తుఫాను హెచ్చరిక నేపథ్యంలో జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు తమ పంటను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జె శివ శ్రీనివాస్ సూచించారు. ఇప్పటి వరకు పంట కోత కోయనివారు వరి పంట కోతను వర్ష ప్రభావం తగ్గే వరకు వాయిదా వేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇప్పటికే పంట కోసిన వారు వరి పనలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, లేదా కుప్పలుగా పెట్టి తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. వర్షాలు తగ్గేవరకు వరి కోతలు, నూర్పులు, తదితర పనులను వాయిదా వేయాలని సూచించారు. గింజలు మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పు నీటిని పిచికారి చేయాలన్నారు. భారీ వర్ష సూచన ఉన్నందున రైతులు తమ పంట పొలాలలో నీరు నిల్వ లేకుండా బయటకు పోయే విధంగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలని జేసీ కోరారు.

ఇద్దరు అధికారుల సస్పెన్షన్

పెదబయలు ఉపతహసిల్దార్, సీనియర్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

ప్రజాశక్తి-పాడేరు: పెదబయలు మండలం తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు అధికారులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో మీసేవ, మ్యూటేషన్, పోతేడ్, రీ-సర్వే, ఎల్పీరెల్ వనులకు సంబంధించి జాప్యం, తద్వారా ప్రజలకు సకాలంలో సేవలు అందక పోవడంతో ప్రజలు చాలా అవస్థలకు గురవుతున్నారని గుర్తించిన కలెక్టర్ పెదబయలు ఉప తహసీల్దార్ వి.కుమార స్వామిని, సీనియర్ అసిస్టెంట్ కె.మత్స్యరాజుని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ కాలంలో వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం 50 శాతం సబ్సిస్టెన్స్ అలవెన్స్ ఇవ్వడం జరుగుతుందని, అదేవిధంగా సస్పెన్షన్ కు గురైన వారిద్దరూ కలెక్టర్ నుండి ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కేంద్రం విడిచి వెళ్లకూడదని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయన్నారు.

పెదబయలు తహసీల్దార్ ఒ.శ్రీనివాసరావు మృతి చెందిన నేపథ్యంలో హుకుంపేట మండల కార్యాలయంలో ఉప తహసీల్దార్ గా పని చేస్తున్న జె. భాస్కరరావును పెదబయలు తహసీల్దార్ గా ఇన్చార్జి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఇన్చార్జి బాధ్యతలు తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు అమలులో ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు.

పెదబయలు: సస్పెన్షన్ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని బాధిత అధికారులు విన్నవించారు. స్థానిక విలేకరులతో వారు శనివారం మాట్లాడారు. బాధితుల్లో డిటిగా విధులు నిర్వర్తిస్తున్న టి.కుమారస్వామి తహశీల్దార్ గానూ, సీనియర్ సహయ కులుగా విధులు నిర్వర్తిస్తున్న కూడా మత్యరాజు డిటిగా త్వరలో పదోన్నతులు పొందే అవకాశం ఉంది.

సప్పర్లతో గిరిజనులతో మాట్లాడుతున్న చింతపల్లి ఎఎస్‌పి శివ కిశోర్ కుమార్

ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- 14న మాదిగమల్లులో మెగా వైద్య శిబిరం

- ఎఎస్‌పి శివ కిశోర్‌కుమార్

ప్రజాశక్తి- సీలేరు

యువ క్రీడాకారులు క్రీడల్లో పోరాట పటిమను ప్రదర్శించి రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయికి ఎంపికై ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని చింతపల్లి సబ్ డివిజనల్ ఏఎస్‌పి శివ కిషోర్ కుమార్ పిలుపునిచ్చారు. జీకే వీధి మండలం దారకొండలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసింగ్ కమ్యూనిటీ లో భాగంగా సంజీవని అనే పేరుతో మెగా వైద్య శిబిరాన్ని ఈనెల 14న గుమ్మరేవుల పంచాయతీ మాదిగ మల్లులో నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు, స్త్రీ వైద్య నిపుణులు, కంటి నిపుణులతో పాటు ఆర్థోపెడికల్ వైద్యులు పాల్గొని పరీక్ష నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. వ్యాధి తీవ్రతను పట్టి ఆపరేషన్లు అవసరమైతే వారికి మైదాన ప్రాంతానికి రిఫరల్ చేసి ప్రత్యేక వైద్య సేవలు అందించడం జరుగుతుందని వెల్లడించారు. అదే రోజు యువ క్రీడాకారులు ప్రతిభను వెలికి తీయడానికి మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. క్రీడల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.25000, ద్వితీయ బహుమతి రూ.15000, తృతీయ బహుమతి రూ.10,000 నగదు పురస్కారం అందజేస్తామని తెలిపారు. గెలిచిన జట్లకు వాలీబాల్ కిట్లు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జికె వీధి విసి అశోక్ కుమార్, ఎస్ఐ అప్పల రాము, స్థానిక ఎస్సై రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఎఎస్‌పి పర్యటన

మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన సప్పర్లలో చింతపల్లి డివిజనల్ ఎస్పీ శివకిషోర్ కుమార్ శనివారం పర్యటించారు. సప్పర్ల సంతలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సంతకొచ్చిన గిరిజనులతో ఏఎస్పి శివ కిషోర్ కుమార్ చర్చించారు. మెగా వైద్య శిబిరంపై ప్రచారం చేశారు.

కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు

-వేడుకల్లో పాల్గొన్న కుంభా రవిబాబు, ఎమ్మెల్యే పాల్గుణ

ప్రజాశక్తి-అరకులోయ: మండల కేంద్రంలోని వాలీబాల్ గ్రౌండ్‌లో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షమ్మ మినిస్ట్రీస్ ఇంటర్నేషనల్ (హైదరాబాద్) డాక్టర్ జోయల్ జస్వంత్ గుమ్మడి మాట్లాడుతూ, క్రీస్తు జననం కోసం వివరించారు. క్రైస్తవ్యం అనేది ఒక మార్గమని ఆయన అన్నారు. క్రీస్తును కలిగిన వాడు మంచి మార్గంలో నడుస్తారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు జరుపుకునే ఒకే ఒక్క పండుగ క్రిస్మస్ మాత్రమేనని ఆయన అన్నారు.

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబు మాట్లాడుతూ, మన్య ప్రాంతంలో క్రైస్తవ్యం అడుగుపెట్టినప్పటి నుంచి అద్భుతమైన సామాజిక చైతన్యం ప్రజల్లో వచ్చిందన్నారు. అటువంటి సామాజిక విప్లవం రావడంతోనే ఆలోచన విధానాలు మారిందన్నారు. క్రైస్తవ్యం క్రమశిక్షణ సత్ప్రవర్తన అలవర్చు కోవడానికి దోహదపడుతుందన్నారు.

అరకు ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ మాట్లాడుతూ, క్రీస్తు జననమే ఒక అద్భుతం, ఆనందమని ఆయన వివరించారు. క్రైస్తవులందరూ ఒకే తాటిపైకి వచ్చి ఐక్య క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం ఆనందదాయక మన్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ కార్యదర్శి ఎస్.బాబురావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు వి.ప్రభుదాస్, కే ఎలీషా, రెవ. కె.ఎస్ బాబురావు, ఎస్.శ్యాంసన్, బిషప్. ఎం.వి. కే.విజయ్ డానియల్ మోడీ, అరకులోయ జడ్పిటిసి శెట్టి రోష్ని, పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, టిడిపి మండల అధ్యక్షులు శెట్టి బాబురావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు శాంతకుమారి, ఎంపిటిసి సభ్యులు దురియా ఆనంద్ కుమార్, వైసీపీ నాయకుడు కమిడి అశోక్, అరకులోయ సీఐ జిడి బాబు, బిషప్. జీ. ప్రసాద్ రావు, వి.ప్రసాద్ పాల్, కె.జాన్ ప్రకాష్, బిఇ సంజీవ్ కుమార్, కే.శామ్యూల్, పి. షద్రక్ పాల్గొన్నారు.

కేకు కట్ చేస్తున్న రవిబాబు, ఫాల్గుణ, జోయల్ జస్వంత్

స్టేట్ బ్యాంక్ ఫ్రీ అకౌంట్‌పై కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి -హుకుంపేట: స్టేట్ బ్యాంక్ ఫ్రీ అకౌంట్‌లను ప్రజలు సద్వినియొగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు సూచించారు. స్థానిక గిరిజన సంఘం కార్యయంలో వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీధర్ బాబు తో కలిసి ఉచిత స్టేట్ బ్యాంక్ జీరో బ్యాలెన్స్ అకౌంట్‌లకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అకౌంట్‌లు లేనివారు స్టేట్ బ్యాంక్ ఫ్రీ జీరో బ్యాలెన్స్ అకౌంట్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. ఈ అవకాశం సోమవారం వరకు మాత్రమే ఉందన్నారు. అకౌంట్ చేయడానికి ముందుగా డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, రఖాఖాస్తు ఫారం, ఆధార్ కార్డ్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు ఉంటే సరిపోతుందని, ఒకే గ్రామంలో 10 మంది ఉంటే ఆ గ్రామానికే వచ్చి అకౌంట్ ఓపెన్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్రీధర్ బాబు, అకౌంట్ అసిస్టెంట్ సూర్యం పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపిపి, బ్యాంకు చీఫ్ మేనేజర్

దగ్ధమై భారీ వృక్షం కింది భాగం

పొంచివున్న ప్రమాదం

రోడ్డు పక్కన పాక్షికంగా దగ్ధమైన భారీ వృక్షం

ప్రజాశక్తి-పెదబయలురూరల్ :మండలంలో సీకరీ పంచాయతీ బంగారమెట్ట గ్రామ సమీపంలో ఆర్ అండ్‌బి రోడ్‌కు అనుకొని ఉన్న పెద్దమామిడి వృక్షం పాక్షికంగా దెబ్బతినడంతో వాహనదారులకు ప్రమాదం పొంచివుంది. ఈ మధ్య కాలంలో మందుబాబులు చెట్టు కింద మంట పెట్టి తగలబెట్టారు. దీంతో, మహా వృక్షం కింద భాగం దగ్ధమైంది. ఈ రోడ్డు మీదుగా నిత్యం పాడేరు, పెదబయలు, ముంచింగిపుట్, జోలపుట్టు వరకు వాహనాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఏ మాత్రం బలమైన గాలి వీచినా చెట్టు కూలిపోయే ప్రమాదం ఉంది. దీంతో ఈ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని కోరారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలో ఈనెల 20, 21వ తేదీల్లో జరిగే సిఐటియు ప్రథమ మహాసభలను కార్మికులు జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కె.శంకర్రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో సిఐటియు నాయకులు ప్రచారం నిర్వహించారు. మహాసభల కరపత్రాలను కార్మికులకు అందజేశారు. అనంతరం ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ, కార్మికులు పని చేసే చోట మౌలిక సౌకర్యాలు కల్పన, ఉద్యోగ భద్రత, కనీస వేతనం వంటి సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఈ మహాసభలు వేదిక కానున్నాయని ఆయన అన్నారు. ఆటో కార్మికుల యూనియన్ భవనం ఏర్పాటు, ఆటో పార్కింగ్ ఏర్పాటు వంటి సమస్యలపై ఈ మహాసభల్లో ఏజెండా అంశాలుగా రూపొందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు జి.నారాయణ, కార్యదర్శి ఎంఎం శ్రీను, ఎస్.గాసిరందొర, బలరాం, డొంబ్రు, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ కృష్ణ, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిఐటియు నాయకులు

కన్నుల పండుగగా స్వర్ణోత్సవ సంబరం

గిరిజన సంప్రదాయ కొమ్ముడోలు నృత్యాలతో సందడిగా మారిన చింతూరు

ప్రజాశక్తి-చింతూరు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ సంబరం శనివారం కన్నుల పండుగగా జరిగింది. ఈ పాఠశాలలో 1974 నుండి 2022 వరకు పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు కలయిక విజయవంతమైంది. తమ బ్యాచ్‌కు చెందిన వారిని ఒకరినొకరు పలకరించుకొని తమ తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తమ గురువులను ఘనంగా సన్మానించారు. 50 సంవత్సరాల చరిత్ర కలిగిన పాఠశాల శనివారం పూర్వ విద్యార్థులతో కళకళ లాడింది. తొలుత శబరి నది రోడ్డు నుండి గురువులను విద్యార్థులు గిరిజన సంప్రదాయ కొమ్ము డోలు నృత్యాలతో ఘనంగా స్వాగతించారు. దారి పొడవున వందలాది మంది విద్యార్థులు పూలవర్షం కురిపించారు. మార్గం మధ్యలోని కూడలి వద్ద ఉన్న మన్యం వీరులు అల్లూరి సీతారామరాజు, గాం ఘంటం దొర, మల్లుదొర, కొమరం భీమ్ విగ్రహాలకు, అంబేద్కర్. మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కీర్తి శేషులు కామ్రేడ్ బత్తుల భీష్మరావు స్మారక కళామందిరంలో గౌరవ సన్మాన సభ ఏర్పాటు చేశారు. స్వాగత ఉపన్యాసం ఎసిపి పరకాల పూర్వ విద్యార్థి జూపల్లి శివరామయ్య చేశారు. సభాధ్యక్షులుగా ఆలపాటి అంకు ప్రసాద్ మాస్టారు వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా చింతూరు ఎఎస్‌పి కెవి.మహేశ్వరరెడ్డి, సిఐ అప్పలనాయుడు, జూపల్లి వెంకటరత్నం, ఎంవిఐ శ్వేత సాయి, విశ్రాంత హెచ్‌ఎం కె.రాంబాబు, కమలాదేవి, పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.లక్ష్మణ్, చైర్మన్ ఎండి జిక్రియ, పాల్గొన్నారు. అనంతరం స్వర్ణోత్సవ పైలాన్‌ను విశ్రాంత ఉపాధ్యాయులు ఆవిష్కరణ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అంబేద్కర్, సావిత్రిబాయి పూలే, రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహాలను కమలాదేవి, వరలక్ష్మి, హిందీ మాస్టారు శర్మ ఆవిష్కరించారు.

సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్య ఎఎస్‌పి మహేశ్వరరెడ్డి తదితరులు

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం : ఆశా వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.వాణిశ్రీ డిమాండ్ చేశారు. శనివారం ఆశా వర్కర్స్ డిమాండ్స్ డే, మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్ల పట్ల అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. చనిపోయిన ఐదుగురు ఆశా వర్కర్ల కుటుంబాలకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సత్యసాయి వాటర్ స్కీమ్ వర్కర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని చెప్పారు. వీరి సమస్యలను పరిష్కారం చేసే దిశగా అధికారులు, ప్రభుత్వం చొరవ చూపకు పోతే రాబోయే రోజుల్లో అన్ని కార్మిక సంఘాలతో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. తొలుత 17వ రోజులుగా సత్యసాయి వర్కర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపారు. కలింకోట రమణమ్మ, కొమరం చెల్లయమ్మ, కుంజం రాధమ్మ, సవిర్ల వెంకటలక్ష్మి, కొంతుల పోశమ్మ, పల్లాల లింగామణి, కుండ్ల జయలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

సత్యసాయి వాటర్ స్కీమ్ వర్కర్ల ఆందోళనకు మద్దతు తెలుపుతున్న ఆశా వర్కర్లు

తుపాన్‌తో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-విఆర్.పురం

మాండూస్ తుపాన్ నేపథ్యంలో మండలంలోని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజులు పాటు మండూస్ తుపాన్ ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ సమాచారంతో రైతులు దిగులు చెందుతున్నారు. మండలంలో వరి పంట కోత దశకు వచ్చింది. పొగాకు, మిర్చి రైతులు పంటపై దీని ప్రభావం ఉంటుందని రైతులు చెబుతున్నారు. మండలంలో సుమరు 3000 ఏకరాల్లో వరిసాగు చేశారు. వరి పండిపోయినా తుపాన్ కారణంగా చాలా మంది కోత కోయలేదు. తుపాన్ ప్రభావం ఎక్కువ రోజులుంటే పంట పాడైపోతుందని రైతులు చెబుతున్నారు. ఆరుగాలం కష్టించి, అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి వరి సాగు చేశామని, ఇప్పుడు తుఫాన్ ఏమి చేస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

చిరు జల్లులు

సీలేరు : మాండూస్ తుఫాన్ కారణంగా జీకే వీధి మండలం సీలేరు, దారకొండ ప్రాంతాల్లో శనివారం చిరు జల్లులు కురిశాయి. దీంతో వాతావరణం చల్లబడింది. చల్లటి గాళ్లు వీస్తున్నాయి. చలి తీవ్రత అధికమైంది. ఉదయం నుంచి ఆకాశం మేఘవృతమే మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల్లో వరి పంటలు పండి కోత దశకు రావడంతో తుఫాన్ కారణంగా చేతికొచ్చిన పంట భుగ్గి పాల అవుతుందని గిరి రైతులు తలలు పట్టుకుంటున్నారు. దారకొండ, కమ్మరతోటలలో వరి కోతలు అడపాదడపా జరుగుతున్నప్పటికీ భారీ వర్షాలు కురిస్తే జలమయమై పంటలు నాశనం అయ్యే అవకాశం ఉందని గిరి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎబబికి క్యూ కట్టిన పర్యాటకులు

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో దాగి ఉన్న ప్రకృతి సుందర దృశ్యాలను తిలకించేందుకు పర్యాటకులు శనివారం క్యూ కట్టారు. ద్విచక్ర వాహనాలపై నిడదవోలు నుంచి రాజమండ్రి మీదగా ఏజెన్సీ ప్రాంతానికి వచ్చారు. రంపచోడవరం పచ్చటి అడవులు ఎత్తైన కొండలు, కోనలు తిలకించి మంత్రముగ్ధులయ్యారు. అదే రహదారి గుండా వారి ప్రయాణం కొనసాగిస్తూ మోతుగూడెం మీదగా పోల్లూరు చేరుకొని వాటర్ ఫాల్స్ తిలకించారు. పర్యాటకులు ద్విచక్ర వాహనాలపై దారి పొడవునా ప్రకృతి అందాలు తిలకిస్తూ సాయంత్రం సీలేరు చేరుకున్నారు. స్థానిక జలవిద్యుత్ కేంద్రం, రిజర్వాయర్లు, సీలేరు పరిసర ప్రాంతాలు మంచుతో మైమరిపిస్తున్న అందాలను తిలకించి ఎంతో అనుభూతిని పొందారు. సీలేరుకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఐసుగెడ్డను సందర్శించారు. దారకొండ ఆలయానికి చేరుకొని ఎత్తైన రెండు కొండల నడుమ జాలవారే జలపాతాలను చూసి పర్యాటకులు పరవశించిపోయారు. గూడెం, చింతపల్లి కాఫీ, మిరియాలు తోటలు, పచ్చటి అందాలను తిలకించారు. అదే రహదారి గుండా లంబసింగి చేరుకొని రాత్రి పర్యాటకుల బస చేశారు.

నిడదవోలు నుంచి ద్విచక్ర వాహనాలపై పర్యాటకులు

పర్యాటకుల తాకిడి

ప్రజాశక్తి -అనంతగిరి: వరుసగా శని, ఆదివారం రోజులు రెండు రోజులు సెలవు దినం కావడంతో మండూస్ తుపాన్‌ని లెక్క చేయకుండా విదేశీ, ఇతర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు మండలానికి తరలి వచ్చారు. ప్రముఖ ప్రర్యాటక కేంద్రమైన బొర్రా గుహలతో పాటు కటిక, చిట్టంపాడు జలపాతంతో పాటు డమ్ముకు యు పాయింట్‌లను సందర్శించారు. పర్యాటకులు సందర్శించి సందడి చేశారు. అనంతరం మర్దగూడ కాఫీ ప్లాంటేషన్, సుంకరమెట్ట యు పాయింట్లను తిలకించారు. తుఫాను కారణంగా మన్యంలో తేలికపాటి వర్షాలతో పాటు దట్టమైన పొగ, మంచులు కమ్మినా దానికి లెక్క చేయకుండా పర్యాటకులు చలిని తట్టుకునే దుస్తులను ధరించి ఆ ప్రాంతాలను తిలకించారు. ఏజెన్సీ అంటేనే చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది, పైగా తుఫాను ప్రభావం ఉండటంతో మరింత ఎముకల కొరకే చలి పర్యాటకులపై పంజా విసిరింది. అనంతగిరి, అరకు ఘాట్ రోడ్ వాహనాల రద్దీ నెలకొంది

ఐక్య క్రిస్మస్ వేడుకలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- హుకుంపేట : ఐక్య క్రిస్మస్ వేడుకలు జయప్రదం చేయాలని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కార్యదర్శులు వి.మోజస్, కే.జేమ్స్ కోరారు. శనివారం స్థానిక మండల కేంద్రంలో శనివారం మాట్లాడుతూ, ఏసు క్రీస్తు జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలన్నారు. ఈనెల 12న సోమవారం ఉదయం కోంతిలి గ్రామ సమీపంలో హుకుంపేట మండల ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. మండలంలోని పలు ప్రాంతాల్లో సేవ చేస్తున్న పాస్టర్స్, సంఘ సభ్యులు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగేందుకు సహకరించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు డేవిడ్, జాన్ బాబు, గౌరవ అధ్యక్షులు కె.ప్రేమ్ కుమార్, యోహన్, డేవిడ్, పాల్ పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- అనంతగిరి:కొత్తవలస, కిరండోల్ కెకె లైన్ మార్గమధ్య తైడా రైల్వే స్టేషన్ సమీపంలో తీవ్రంగా గాయలకు గుర్తు తెలియని వ్యక్తిని రైల్వే శాఖ సిబ్బంది శనివారం గుర్తించారు. రైలు పట్టాల సమీపంలో వర్షంతో తడిసి బురదగా దుప్పట్లతో ఉన్న వ్యక్తిని గుర్తించి వైద్యం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే సిబ్బంది తెలిపారు. సదరు వ్యక్తి రైలు నుండి పొరపాటున జారీ పడ్డాడా అనే కోణంలో రైల్వే శాఖ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

పాఠశాలలో పేరెంట్స్ సమావేశం

మాట్లాడుతున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి పాడేరు:- స్థానిక మోదమాంబ హైస్కూల్ లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం, స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కోవిడ్ కారణంగా చదువుకు చాలా ఆటంకాలు ఏర్పడినప్పటికీ, ఈ పాఠశాలలో మాత్రం పాఠశాల వ్యవస్థాపకుడు కీర్తిశేషులు వరాహమూర్తి ఆశయ సాధనతో మెరుగైన విద్య అందించాలని ఉద్దేశంతో పాఠశాల ప్రిన్సిపల్ నాగమణి ముందుకు నడిపిస్తున్నారు. ఈ సమావేశంలో ఉత్సాహంగా పాఠశాల విద్యార్థుల పేరెంట్స్ పాల్గొని తమ పిల్లల చదువు, క్రమశిక్షణ బాగోగులు వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎల్‌సి ప్రోగ్రాంని స్టూడెంట్స్ ప్రదర్శించారు. ఈ ప్రోగ్రాంని పేరెంట్స్, టీచర్స్, స్టూడెంట్స్ అందరు కలిసి విజయవంతం చేసినందుకు మోదమాంబ హైస్కూల్ ప్రిన్సిపాల్ నాగమణి సంతృప్తిని వ్యక్తం చేశారు.

ఐర్లాండ్ విశ్వవిద్యాలయాలపై ఏయూలో అవగాహన

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఐర్లాండ్ దేశానికి చెందిన విశ్వవిద్యాలయాలపై ఏయూలో శనివారం అవగాహనా సదస్సును ఉన్నత విద్యమండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి ప్రారంభించారు. భారతీయ విద్యార్థులకు ఐర్లాండ్‌లో విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఐర్లాండ్, అమెరికా, ఫ్రాన్స్ దేశాలకు చెందిన 14 విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో మాట్లాడారు. ఐర్లాండ్ విశ్వవిద్యాలయాలు అందిస్తున్న కోర్సులు, ఫీజుల వివరాలు, విశ్వవిద్యాలయాల ప్రాముఖ్యత తదితర అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి మాట్లాడారు.

రైతు విలవిల

- తడిసిన కోసిన వరిచేను
- అనకాపల్లి జిల్లాలో 13.5 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

మాండూస్ తుపాను ప్రభావం జిల్లాపై పడింది. వరి పంట తడిసిన రైతులు పంట పోతుందని విలవిల్లాడుతున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి కురిసిన వర్షాలకు కోసిన వరిచేను పొలాల్లో తడిసింది. ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. జిల్లా వ్యాపితంగా దాదాపు 15వేల ఎకరాల్లో రైతులు వరిచేను కోశారు. చేను ఎండాక కుప్పలు పెట్టుకుందామనేలోపు తుపాను రావడంతో అది వర్షాలకు తడిసింది. వర్షాలకు భయపడి ఆరకుండానే కుప్పలు వేసుకున్నా పంట నష్టం కూడా జరగనుంది. అయితే శనివారం నాటికి వరి పంట నష్టం నమోదుకాలేదని జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహనరావు ప్రజాశక్తికి తెలిపారు. శనివారం కురిసిన వర్షాలకు జిల్లాలో 13.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా రాంబిల్లి మండలంలో 34,2, అత్యల్పంగా గొలుగొండలో 5.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. స్వల్ప గాలులు కూడా వీయడంతో కోయాల్సిన వరిపంట నేలకొరిగింది. పంట చేతికి రావాల్సిన సమయంలో తుపాను రావడంతో రైతుకు కొంత నష్టం వాటిల్లనుంది. వర్షాలు ఎక్కువైతే రైతులు భారీగానే నష్టపోనున్నారు.

వర్షాలకు పంట నష్టంలేకుండా కొన్ని పద్ధతులు పాటించాలని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కె.రాజారెడ్డి సహా వ్యవసాయశాస్త్రవేత్తలు ఎంఎంవి శ్రీనివాసరావు, డాక్టర్ కె.లక్ష్మణ్ కొన్ని సూచనలు చేశారు.

ఇవీ సూచనలు

కోతకు ముందు వర్షాలు పడితే లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పు నీటిని వెన్నుపై జల్లాలి. పనలమీద తడిసిన పంటకు ఉప్పు ద్రావణంలో కంకులను ముంచి ఆరబెట్టి చిన్నచిన్న కుప్పలుగా వేయాలి. లేదంటే తడిచిన చేను ఆరాక కుప్పలుగా వేస్తే ఉప్పు పొడిని కంకులపై చల్లాలి. నూర్చిన తరువాత ధాన్యం తడిస్తే క్వింటాకు ఒక కిలో ఉప్పు, నాలుగు కిలోల ఊక లేదా ఎండిన గడ్డి చిన్నచిన్న ముక్కలుగా చేసి కలిపి కుప్పగా పోసి వారం రోజుల తరువాత ఆరబెట్టాలి.

జిల్లాలో వర్షపాతం

రాంబిల్లిలో 34.2, మునగపాకలో 22.4, యలమంచిలిలో 22.2, పరవాడలో 16.2, కశింకోటలో 15.4, సబ్బవరంలో 15, అచ్యుతాపురంలో 14.6, కోటవురట్లలో 14.2, నర్సీపట్నంలో 13.6, చీడికాడలో 13.4, కె.కోటపాడులో 13.4, మాకవరపాలెంలో 12.8, బుచ్చెయ్యపేటలో 12.6, ఎస్.రాయవరంలో 12.6, మాడుగులలో 12.4, రోలుగుంటలో 11.6, పాయకరావుపేటలో 10.2, దేవరాపల్లిలో 9.8, రావికమతంలో 9.2, నక్కపల్లిలో 9.2, చోడవరంలో 8.6, నాతవరంలో 7.6, అనకాపల్లిలో 6.6, గొలుగొండలో 5.2 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి-అరకులోయ:అరకులోయలోని గిరిజన భవన్ లో శనివారం మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.మానవ హక్కుల నేర నిరోధక సంఘం ఏపీ ఏజెన్సీ కమిటీ అధ్యక్షురాలు కే.కృష్ణకుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అరకులోయ సీఐ జీడి బాబు పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగంలో మానవ హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా అనేక చట్టాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ బాధ్యతో అంకిత భావంతో ఉంటేనే మానవ హక్కులు పరిరక్షించబడతాయని ఆయన అన్నారు. మానవ హక్కులు కాపాడడానికి పోలీస్, ప్రభుత్వ యంత్రాంగం విశేషంగా కృషి చేస్తుందన్నారు. చట్టానికి లోబడి పని చేస్తేనే హక్కులు, చట్టాలు రక్షించబడతాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో అరకులోయ జడ్పిటిసి శెట్టి రోషిని, ఎంపిటిసి ఆనంద్ కుమార్, వైసిపి నాయకులు కమిడి అశోక్, ధండకారణ్య ఒకేషనల్ జూనియర్ కళాశాల వ్యవస్థాపకుడు శ్రీను, మానవ హక్కుల నేర నిరోధక సంఘం ప్రతినిధులు డి.మహేష్, మోహన్, కే. రవీంద్ర, పి.ధర్మ, రామకృష్ణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బాలదేవ్, మయూరి రాజారావు పాల్గొని మాట్లాడారు.అనంతరం క్రిస్మస్ కేక్ నుంచి కట్ చేసి, విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తున్న సిఐ జీడి బాబు ను సన్మానం చేశారు.

సిఐని సన్మానిస్తున్న కృష్ణకుమారి తదితరులు

ఎపిజివిబి సేవలపై అవగాహన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెద్దపుట్టు, బలడ గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఎపిజివిబి) మేనేజర్ సంతోష్ కుమార్, బ్యాంకు మిత్ర భగత్ రామ్ ఆధ్వర్యంలో బ్యాంకుల్లో జరిగే లావాదేవీలపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రత్యేక కళాజాతా బృందంతో అవగాహన కల్పించారు. బ్యాంకు లావాదేవీలు, సామాజిక భద్రత, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన, ప్రధానమంత్రి సురక్ష భీమ యోజన తదితర పథకాలపై కళాజాతా బృందం అవగాహన కల్పించారు.

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలని చూస్తే సహించం

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాళథం

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలని చూస్తే సహించేది లేదని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం స్పష్టంచేశారు. శుక్రవారం జరిగిన సిఐఐ గ్లోబల్ ఎకనామిక్ సమ్మిట్‌లో కేంద్ర ప్రభుత్వ డిపార్టుమెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) సెక్రటరీ తూహిన్ కాంత్ పాండే కేంద్ర ప్రభుత్వం తరుపున మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మి తీరుతామని ప్రకటించడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్లాంట్ కార్మికులు, రాష్ట్ర ప్రజానీకం చేస్తున్న ఆందోళనను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా వ్యవహరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఏది అనుకుంటే అది చేస్తాం అనే విధంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం ప్రకటనలు చేయడం తగదని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి మొండి వైఖరిని రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలూ, ప్రజా సంఘాలూ తీవ్రంగా ఖండించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అన్ని పార్టీలను కలుపుకొని కేంద్రంపై పోరాటానికి సిద్ధంకావాలని కోరారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సంవత్సర కాలంగా ఉద్యమం చేస్తుంటే, ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా మిత్రులైన అదానీ, అంబానీల సేవలో మునిగితేలుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. దేశభక్తి పేరు చెప్పి దేశంలో ఉన్న అన్ని ప్రభుత్వరంగ సంస్థలను మోడీ ప్రభుత్వం తన అనుయాయులకు కారుచౌకగా కట్టబెట్టే కుట్రలను ప్రజలందరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని మోడీ ఆపాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటాం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికులందరిపైనా ఉందని విశాఖ జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు మరపురెడ్డి కొండబాబు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 618వ రోజుకు చేరాయి. దీక్షల్లో డిజిఎన్ వర్కర్స్ యూనియన్, విశాఖ జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రతినిధులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు వారి వారి ఎజెండాలు పక్కనపెట్టి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగంలో స్టీల్‌ప్లాంట్ కొనసాగేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా కార్మికులతో కలిసి ఉద్యమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిజిఎన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సూర్యప్రకాష్, కోశాధికారి వై.వెంకట్రావు, నాయకులు వికాస్, శ్యామ్, విశాఖ జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు బి.శ్రీనివాస్, సత్యారావు, సాగర్, గోపాల్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ముఠా కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మహాసభ డిమాండ్ చేసింది. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన యూనియన్ 10వ మహాసభలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో సుమారు 10 వేల మంది ముఠా కార్మికులు లోడింగ్ అన్ లోడింగ్ పనులు చేసుంకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. లక్షలాది టన్నుల ఆహార ధాన్యాలు, ఇతర సరుకులు రవాణా చేయడంలో ముఠా కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా, ముఠా కార్మిలకు సమగ్రమైన చట్టం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం లేదన్నారు. వామ పక్ష పార్టీ అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంలో ముఠా కార్మికులకు అన్ని విధాలుగా అక్కడి ప్రభుత్వం రక్షణగా నిలుస్తోందని తెలిపారు. ముఠా కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చట్టం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ముఠా కార్మికులు ఆందోళనలు ఉధృతం చేయాలని పిలుపు ఇచ్చారు. సిఐటియు జిల్లా నాయకులు వై.రాజు, జి. పోలీశ్వరరావు మాట్లాడారు. అనంతరం విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

నూతన కమిటీ

అధ్యక్షులుగా టి.పైడిరాజు, ఉపాధ్యక్షులుగా ఎస్.రమణ, రాము, ప్రధాన కార్యదర్శిగా ఎం.సుబ్బారావు, సహాయ కార్యదర్శులుగా నాయుడు, తాతారావు, కోశాధికారిగా పివిఎస్ఎన్.రాజు, ప్రతి ముఠా జట్టు మేస్త్రి కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

రికార్డు స్థాయిలో 66మందికి హెచ్‌పిసిఎల్‌లో ఉద్యోగావకాశాలు

గురువులకు కృతజ్ఞతలు తెలిపిన కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు

ప్రజాశక్తి -కంచరపాలెం: హెచ్‌పిసిఎల్ అపరెంటిస్ టెక్నీషియన్స్ ఉద్యోగాలకు ఎంపికైన కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు శనివారం ప్రిన్సిపల్ డాక్టర్ బి.వెంకటరమణను మర్యాదపూర్వకంగా కలిసి కతజ్ఞతలు తెలిపారు. దేశవ్యాప్తంగా హెచ్‌పిసిఎల్ కెమికల్ విభాగానికి సంబంధించి 92 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా, వేలాదిమంది పరీక్షలు రాశారు. విశాఖ ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కాలేజ్ (జిఇసి)కు చెందిన 66 మంది ఉద్యోగాలకు ఎంపికై రికార్డు సష్టించారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసిన ఇక్కడి విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రిన్సిపల్ వెంకటరమణ ఆధ్వర్యంలో పోటీ పరీక్షకు తర్ఫీదునిచ్చి తీర్చిదిద్దారు. దీంతో వారు పరీక్షలో ప్రతిభ చూపి ఉద్యోగాలకు ఎంపికై ప్రస్తుతం హెచ్‌పిసిఎల్‌లో శిక్షణ పొందుతున్నారు. వీరంతా ప్రిన్సిపల్ వెంకటరమణను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలేజ్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.వి లక్ష్మణరావు పాల్గొన్నారు

'ఉత్తరాంధ్ర పొలికేక'కు అనుమతుల తిరస్కరణ

వైసిపి పతనానికి నాంది

మాట్లాడుతున్న న్యాయవాది శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి -సీతమ్మధార : హైకోర్టు అనుమతులిచ్చిన ఉత్తరాంధ్ర పొలికేకకు నగర పోలీస్ కమిషనర్ తిరస్కరించటంతోనే వైసిపి ప్రభుత్వ పతనం ప్రారంభమైందని, జైభీమ్ భారత్ పార్టీ అధినేత, మాజీ న్యాయమూర్తి, హైకోర్టు న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పులికేక సభకు హైకోర్టు ఇచ్చిన అనుమతి పత్రాలు చూపినా సిపి శ్రీకాంత్ వైసిపి కార్యకర్తల వ్యవహరించి తిరస్కరించడం దుర్మార్గమని మండిపడ్డారు. దీనిపై సిపి శ్రీకాంత్, జివిఎంసి కమిషనర్లపై కోర్టుధిక్కరణ పిటిషన్ వేయనున్నట్లు తెలిపారు. డాక్టర్ సుధాకర్ పేరు పెట్టడమే ఇబ్బంది అయితే, పేరు కూడా తొలగిస్తామని చెప్పినా అనుమతులు నిరాకరించారన్నారు. విశాఖ విచ్చేసిన పవన్ కల్యాణ్‌ను వైసిపి ప్రభుత్వం బలవంతంగా తిప్పిపంపించిందన్నారు. ప్రతిపక్షాలు మాట్లాడనివ్వకుండా నియంతలా వ్యవహరిస్తున్న వైసిపికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. అనుమతులు ఇవ్వకపోవడానికి తమదేమైనా నిషేధిత జాబితాలో ఉన్న మావోయిస్టు సంస్థ అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ కన్వీనర్ కారం మమత, వినయ్, కార్యకర్తలు పాల్గొన్నారు

ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి

ఆదివాసీ అడ్వకేట్ మడివి రవితేజ

పజాశక్తి-ఎటపాక : మండలంలో గిరిజనుల ఇళ్ల స్థలాల సమస్యను తక్షణమే పరిష్కరిచాలని ఆదివాసీ అడ్వకేట్ మడివి రవితేజ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ధర్నా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దిరోజులుగా పోలవరం నిర్వాసితులు, ఆదివాసీలు చేస్తున్న పోరాటం న్యాయమైనదని, వారి పోరాటాన్ని సానుకూలంగా స్పందించి ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, దేవస్థానం భూముల మీద హక్కు ఆదివాసులకే చెందుతుందని, దానిని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ సమావేశంలో గిరిజన సంఘం నాయకులు కాకా అర్జున్, నక్క సూరిబాబు, ఇరప అజయ్, కారం నగేష్, బుద్దుల భద్రయ్య, పెనుబల్లి బీష్మ, ఇరప సత్యం, కొండ వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

హరిత సాంకేతిక పరిజ్ఞానంపై గీతంలో ముగిసిన సదస్సు

1ప్రజాశక్తి- మధురవాడ : నూతన హరిత సాంకేతిక పరిజ్ఞానంలో వ్యవసాయరంగాన్ని లాభసాటిగా చేసినప్పుడే భవిష్యత్తులో దేశ అవసరాలకు తగ్గట్టుగా ఆహర పంటలను ఉత్పత్తి చేయగలమని దక్షిణాసియా పర్యావరణ వేదిక అధ్యక్షుడు డాక్టర్ దిప్యాన్ దే అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'సుస్థిర అభివద్ధికి హరిత సాంకేతిక పరిజ్ఞానం' అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా దిప్యాన్ దేమాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులను సైతం తట్టుకుని నిలిచేలా దేశ వ్యవసాయరంగం సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో వ్యవసాయరంగాన్ని సుస్థిర పరచాలంటే సాగుదారుడితో పాటు, ప్రభుత్వ విధానాలు, బ్యాంకింగ్ రంగం, వ్యవసాయ పరిశోధనలు, సామాజిక కార్యకర్తలు, విశ్వవిద్యాలయాలు ఏకతాటిగా పనిచేయాలని అభిప్రాయ పడ్డారు.

కువైట్ వాటర్ రీసెర్చి సెంటర్ డాక్టర్ ఎస్.ధనురాధ హరిత సాంకేతిక పరిజ్ఞానంతో నీటివనరులను ఏవిధంగా శుద్ధి చేయవచ్చునో వివరించారు. పోలాండ్‌కు చెందిన బిల్డింగ్ సర్వీసెస్ విభాగం పరిశోధకుడు ఎవా కర్వోవ్‌స్కా భవన నిర్మాణ సామగ్రి సామర్థ్యం పెంచడానికి జీవశిలీంద్రాలు ఏవిధంగా ఉపకరిస్తాయో వివరించారు. గీతం పర్యావరణ శాస్త్రవిభాగం సీనియర్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్ ఫైటో కెలటిన్ వినియోగించి భూపొరలలో ప్రమాదకర కాలుష్యకారకాలను తొలగించే విధానాలు వివరించారు. పశ్చిమ బెంగాల్‌లోని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇకలాజికల్ ఇంజనీరింగ్ పరిశోధకుడు ప్రొఫెసర్ జయంతకుమార్ బిస్వాస్ వ్యర్థజలాలను శుద్ధికి హరిత సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై వివరించారు. సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సంజత్ కుమార్ సాహూ పట్టణ వ్యర్థాల నిర్వహణలో వర్మీ కంపోస్ట్ ప్రాధాన్యతను వివరించారు. గీతం పర్యావరణశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సరిత అధ్యక్షత వహించిన సదస్సులో కన్వీనర్ డాక్టర్ డాక్టర్ ఎమ్.కిరణ్మయి రెడ్డి మాట్లాడుతూ సదస్సును వర్చ్యువల్ విధానంలో రాజస్థాన్, బెంగాల్, ఒడిస్సా, అనంతపూర్ ప్రాంతాలలోని విద్యాలయాల ప్రతినిధులు పరోక్షంగా పాల్గొన్నారని తెలిపారు.

గీతం సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు

ఉత్సాహంగా వీల్‌చైర్ క్రికెట్ పోటీలు

వీల్‌చైర్ క్రికెట్ పోటీలలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంత క్రీడాకారులు

ప్రజాశక్తి- మధురవాడ:తానా ఆధ్వర్యంలో గీతం వేదికగా దక్షిణభారత విభిన్నప్రతిభావంతుల వీల్‌చైర్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వీల్‌చైర్‌లో కూర్చుని బౌలింగ్, బ్యాటింగ్, కీపింగ్ చేయడం అబ్బురపరిచేదిగా ఉంది. శరీరంలో ముఖ భాగానికి తగలకుండా బౌలింగ్ చేయడం ఒక ఎత్తైతే బ్యాటింగ్ ప్రతిభతో పరుగుల వరద పారించడం విశేషంగా ఆకట్టుకుంటోంది.

తెలంగాణాపై ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం

పోటీలలో రెండవరోజైన శనివారం ఆంధ్ర, తెలంగాణ జట్లు తలపడగా, ఆంధ్రాజట్టువిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన తెలంగాణాజట్టు నిర్ణీత 15 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసింది. జట్టులో షేక్ మైన్ 8 ఫోర్లతో 48 పరుగులు సాధించాడు. ఆంధ్ర బౌలర్ మురపాక నళిని 3 ఓవర్లలో 3 వికెట్లు చేజిక్కించుకుని బెంబేలెత్తించాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రజట్టు కేవలం 7 ఓవర్లలోనే ఒక వికెట్ నష్టపోయి 78 పరుగులు సాధించి విజయాన్ని అందుకుంది. ఆంధ్ర జట్టులో ఎమ్.సంతోష్ 6ఫోర్లతో 34 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి జట్టు విజయంలో కీలక భూమిక పోషించాడు. కర్ణాటక, తమిళనాడు జట్ల మధ్య జరిగిన మరో పోటీలో కర్ణాటక జట్టు 7 వికెట్ల తేడాతో ప్రత్యర్థిపై విజయం సాధించింది.

అన్నదాతల అవస్థలు

- కల్లాల్లోనే ధాన్యం రాశులు
- పొలాల్లో తడిసిన వరిచేను కుప్పలు
- ధాన్యం నాణ్యత చెడుతుందని రైతుల ఆవేదన

కల్లాల్లోని ధాన్యం రాశులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -ఆనందపురం : మాండూస్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షంతో అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. అనేకచోట్ల కోసిన వరి పచ్చిచేనును కుప్పలుగా వేయడం, తడి ఆరని ధాన్యాన్ని రాశులుగా పోగులు చేసినప్పటికీ, వర్షం కొనసాగితే ధాన్యం నాణ్యత చెడిపోతుందని, చేను కుళ్లి పాడౌతుందని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని బోని, సిర్లపాలెం, పేకేరు, కుసులువాడ, ఆనందపురం, పొడుగు పాలెం తదితర గ్రామాలలో వరి పంట సాగు చేశారు. బోని గ్రామంలో 15 రోజుల క్రితమే వరి కోతలు కోసారు. అప్పటినుండి ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి సరైన సౌకర్యాలు లేక కొంతమంది రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మేశారు. మిగిలిన కొంతమంది ధాన్యాన్ని నిలువ చేసుకోగా, అకాలంగా వచ్చిపడిన వర్షాలు వారిలో గుబులు పుట్టిస్తున్నాయి.

కుసలవాడ, పేకేరు, సిర్లపాలెం పొడుగుపాలెం, ఆనందపురం గ్రామాలలోవరిచేను కోసిన రైతులు మాండూస్ తుఫాన్ హెచ్చరికలతో వరి చేనును పొలాల్లోనే గాలికుప్పలు పెట్టారు. పచ్చి చేను కుప్పలు పెట్టడం వలన కుళ్లిపోయే అవకాశం ఉంటుందని, తుఫాను తగ్గిన తర్వాత మరల ఆరబెట్టి కుప్పలుగాగానీ, నూర్పులు చేయాల్సి ఉంటుందని, మాండూస్ వల్ల ఒకే పనిని పదేపదే చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. 15రోజుల ముందే బోనీ రైతులు సిద్ధం చేసిన ధాన్యం అమ్ముడు పోక కల్లాల్లోనే కుప్పలుగా దర్శనమిస్తున్నాయి.

అధికారుల పరిశీలన

బోని గ్రామాన్ని శనివారం సివిల్ సప్లై డిఎం రాజేశ్వరి, వ్యవసాయ అధికారి సంధ్యా రత్నప్రభ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బోని అప్పలనాయుడు, పిఎసిఎస్ సభ్యులు ఎస్ నారాయణరావు పంచముఖి సందర్శించారు. కల్లాల్లోని ధాన్యాన్ని పరిశీలించారు ముందు కోసిన రైతులు ధాన్యం తేమశాతం తక్కువగా ఉందని, ఇటీవల కోసిన రైతులు ధాన్యం పచ్చిగా ఉన్నాయని కొన్ని రోజులు ఆరబెట్టాలని రైతులకు సూచించారు

బోనిలో గొడౌన్ ఏర్పాటు చేయాలి

బోని గ్రామంలో వరి సాగు ఎక్కువగా ఉంటుందని, ధాన్యం నిల్వకు గొడౌన్ ఏర్పాటు చేయాలని పంట భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోనీ అప్పలనాయుడు ఆధ్వర్యంలో రైతులు సివిల్ సప్లై డిఎం రాజేశ్వరికి విన్నవించారు.

గీతం ఐఇటిఇ విద్యార్థుల సేవానిరతి

ప్రజాశక్తి- మధురవాడ :గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఇనిస్టిట్యూట్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఇటిఇ) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శనివారం సాగర్‌నగర్‌లోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లను, డోర్ మ్యాట్లను పంపిణీ చేశారు. ఆశ్రమంలోని వృద్ధులతో చాలాసేపు ఆహ్లాదంగా గడిపి, తామున్నామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఇసిఇ. విభాగాధిపతి డాక్టర్ జెబి.సెవెన్త్‌లైన్, డాక్టర్ నీరజ, డాక్టర్ ఎమ్‌కె.వి.సత్యకుమార్, డాక్టర్ పి.రాజు, డాక్టర్ మహ్మద్ చిస్టీ, విద్యార్థి విభాగం కోఆర్డినేటర్లు వర్షిణి, ఎమ్ఎవిఎస్.తేజ పాల్గొన్నారు.